నల్లగొండ, పాలమూరు ప్రాజెక్టులపై వివక్ష

- పదేళ్లలో కెసిఆర్ ఎస్ఎల్‌బిసికి పైసా ఖర్చు చేయలే ..
- రూ.2 వేల కోట్లతో పూర్తయ్యేది.. ఇప్పుడు 4600 కోట్లు
- ప్రపంచంలో 40 కి.మీ. టన్నెల్ ఎక్కడా లేదు
- ఇది పూర్తైతే తెలంగాణ రికార్డ్ : సిఎం రేవంత్ రెడ్డి
- మ్యాగ్నెటిక్ సర్వే ద్వారా ఎల్ఎల్‌బిసి పనుల పరిశీలన


హెలికాప్టర్ మ్యాగ్నెటిక్ సర్వే పనులను పరిశీలిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రాజెక్టుల పట్ల వివక్ష చూపారు.. ఏడాదికి కిలోమీటరు సొరంగం తవ్వినా ఎస్ఎల్‌బిసి ద్వారా నల్లగొండ ఫ్లోరైడ్ బాధితులకు తాగు, సాగునీరు అందేది. నాడు కాంగ్రెస్ మొదలుపెట్టిన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తే ఆ పార్టీకి మంచి పేరు వస్తుందన్న కపట బుద్ధితో ఎస్ఎల్‌బిసితో పాటు కెఎల్ఐ బీమా, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు ప్రాజెక్టులను కెసిఆర్ పూర్తి చేయలేదు.. కెసిఆర్ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు వ్యయం పెరిగింది.." అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి దగ్గర ఎస్ఎల్‌బిసి పనుల పునరుద్ధరణ కోసం హెలికాప్టర్ మ్యాగ్నెటిక్ సర్వే పనులను సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉన్నారు. అనంతరం మన్నెవారిపల్లిలో మీడియా సమావేశంలో సిఎం మాట్లాడారు.

30 టీఎంసీల తరలింపుతో మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 1983లో ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు మంజూరైందన్నారు. అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ చివరికి ఉమ్మడి రాష్ట్రంలో 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో టన్నెల్-1, టన్నెల్-2 పనులను రూ.1968 కోట్లతో ప్రారంభించారని గుర్తు చేశారు. టన్నెల్ బోరింగ్‌మెషిన్‌ను దేశంలోనే తొలిసారి ఎస్ఎల్‌బిసి టన్నెల్‌కు ఉపయోగించారని తెలిపారు. 2014 వరకు 30 కిలోమీటర్లు పూర్తయితే.. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదన్నారు. ఏడాదికి కిలోమీటర్ తవ్వినా 10 ఏండ్లలో ఈ ప్రాజెక్టు పూర్తయి ఫ్లోరైడ్ బాధితులకు తాగునీరు, బీడు భూములకు సాగునీరు అందేదని అన్నారు. రాజకీయ దురుద్దేశంతో ఆ నాటి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కన పెట్టి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. గ్రావిటీ ద్వారా నల్లగొండకు నీళ్లు తీసుకెళ్లాలనుకుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచంలో 40 కి.మీ టన్నెల్ ఎక్కడా లేదని, అత్యంత ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తామని చెప్పారు. ఇది పూర్తయితే తెలంగాణకు ఇది రికార్డు దక్కుతుందన్నారు. ఆనాడు రెండు వేల కోట్లు ఖర్చుతో ఈ ప్రాజెక్టు పూర్తయ్యేదన్నారు. బిఆర్ఎస్ నిర్లక్ష్యం, వివక్ష వల్ల ఇప్పుడు పెరిగిన అంచనాలతో రూ.4600 కోట్లకు ఈ టన్నెల్ ఖర్చు పెరిగిందన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయకపోవడమేకాదు.. అనేక ఆటుపోట్లను దాటుకుంటూ తాము అధికారంలోకొచ్చాక మళ్లీ పనులు మొదలు పెట్టామని తెలిపారు. గుట్టలలో ఉన్న పొరల కారణంగా లూజు మట్టి వచ్చి దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగి ఎనిమిది మంది కార్మికులు చనిపోయారన్నారు. ఆ కుటుంబాలను ఆదుకుని పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. కెసిఆర్ పదేళ్ల కాలంలో రూ.లక్షా 86 వేల కోట్లు కాంట్రాక్టర్లకు ప్రాజెక్టుల నిర్మాణంలో ముట్టజెప్పారని ఆరోపించారు. అందులో లక్ష ఐదు వేల కోట్లు కాళేశ్వరం కోసమే ఖర్చు చేసినా.. ఎకరా కూడా తడపలేదని విమర్శించారు. కృష్ణానది నీటిలో మన వాటా మనం తీసుకోకపోవడం వల్ల ఆంధ్రా తరలించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 299 టిఎంసిల వాటా అని ఆనాడు హరీశ్‌రావు సంతకం పెట్టిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. మన వాటా మనకు దక్కాల్సిందేనని ట్రిబ్యునల్‌లో తాము వాదనలు వినిపిస్తూ ఒక కొలిక్కి తీసుకొస్తున్నామని చెప్పారు.

హరీశ్‌రావు చిల్లర మాటలు మానుకోవాలి
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

"తప్పులు.. అప్పులు చేసి దోపిడీ చేశారనే ప్రజలు మిమ్మల్ని పక్కనబెట్టారు.. ప్రజా పాలన అందజేస్తున్న కాంగ్రెస్‌పై మీ విమర్శలు సరికావు" అని సాగునీటి వనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాజీ మంత్రి హరీశ్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయకపోతే ఇక్కడి ప్రజలు మమ్మల్ని క్షమించరని, ముంపుకు గురవుతున్న మర్లపాడు, కేశ్యతండా, నక్కలగండి తండా ప్రజలను ఆదుకుని, డిసెంబర్ 31 లోగా సమస్యలు పరిష్కరించే బాధ్యత మా ప్రభుత్వానిదని చెప్పారు. ఇప్పుడు కాకపోతే ఈ ప్రాజెక్టును ఇంకెప్పుడూ పూర్తి చేసుకోలేమని, ఎన్ని అడ్డంకులు వచ్చినా వాటిని తొలగించుకుని ప్రాజెక్టు పూర్తి చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, ఆర్మీ నిపుణులు, ఎంజిఆర్ ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

హస్తకళలు అంతరించిపోకుండా పరిరక్షించాలి

- శిల్ప బజార్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హస్తకళలు అంతరించిపోకుండా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని హెచ్ఎండిఎ గ్రౌండ్‌లో తెలంగాణ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ భారత ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. 2024-25కుగాను ఉత్తమ ప్రతిభ కనబర్చిన 11 మంది హస్తకళల కళాకారులకు రాష్ట్ర స్థాయి అవార్డులు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిలుస్తుందని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం హస్త కళాకారులకు ఉపాధి దొరికేలా అవకాశాలు కల్పిస్తామని హామీనిచ్చారు. ఎంతో ప్రత్యేకమైన హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్లు, చేనేత ఉత్పత్తులను ఎయిర్ పోర్టులు, రైల్వే స్టేషన్ లాంటి ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసి బాగా ప్రమోట్ చేయాలని సూచించారు. ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి సుమారు 150 హస్త కళల, చేనేత ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్ టైల్స్ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, అసిస్టెంట్ డైరెక్టర్ సువార్చల రాణి,పాల్గొన్నారు.

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు 700 ఎకరాల భూసేకరణకు అనుమతి

- జిఒ జారీ చేసిన రాష్ట్ర సర్కారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లాలో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధి కోసం 700 ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. ఈ మేరకు జీవో నెంబర్ 73ని విడుదల చేసింది. ఈ ప్రాజెక్టు సాధ్యసాధ్యాలపై ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ)నివేదిక సానుకూలంగా రావడంతో భూసేకరణ ప్రక్రియను వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆదిలాబాద్ అభివృద్ధికి ఎయిర్‌పోర్టు కీలక ముందడుగు కాబోతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ నిర్ణయం ఉత్తర తెలంగాణలో వాణిజ్యం, పర్యాటకం, పరిశ్రమలు, అత్యవసర సేవలు వంటి రంగాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమగ్ర రవాణా మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సమతుల్య ప్రాంతీయ వృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతున్నదని పేర్కొన్నారు.

ముగిసిన కామిక్ కాన్ ప్రదర్శన

హైదరాబాద్ : నగరంలో మూడు రోజుల పాటు నిర్వహించిన కామిక్ కాన్ ఎక్స్ డ్రీమ్‌హాక్ ఇండియా విజయవంతంగా ముగిసిందని ఆ వర్గాలు తెలిపాయి. క్రంచీరోల్ సహకారంతో హైటెక్స్‌లో అక్టోబర్ 31వ తేదీ నుంచి నవంబర్ 2వ తేదీ వరకు జరిగిన ఈ కార్యక్రమం బొమ్మల కథల (కామిక్స్), జపనీస్ యానిమేషన్ (అనిమే), వీడియో క్రీడల (గేమింగ్), ప్రత్యేక వేషధారణ (కాస్‌ప్లే) సహా వీటికి సంబంధించిన ప్రపంచ అభిమానులందరినీ ఒకచోట చేర్చిందని కామిక్‌కాన్ ఇండియా సిఇఒ షెఫాలీ జాన్సన్, నోడ్‌విన్ గేమింగ్ కోఫౌండర్ అక్షత్ రాఠీ తెలిపారు. ఈ సమావేశానికి 400 మందికి పైగా వేషధారులు సహా 40,000 మందికి పైగా అభిమానులు హాజరయ్యారని వెల్లడించారు.

హైదరాబాద్‌లో జీస్ 7వ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్ : ఆప్టికల్, కొలతల పరిష్కారాలలో కీలక సంస్థగా ఉన్న జీస్ ఇండియా హైదరాబాద్‌లో తన ఏడవ క్వాలిటీ ఎక్సలెన్స్ సెంటర్ (క్యూఇసి)ని ప్రారంభించింది. భారతదేశ ఏరోస్పేస్, అధునాతన తయారీ రంగాలలో ఆవిష్కరణల్లో తమ నిబద్ధతకు ఇది నిదర్శనమని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వ ఏరోస్పేస్, డిఫెన్స్, లాజిస్టిక్స్ డైరెక్టర్ ప్రవీణ్ పిఎ, జీస్ ఇండియా ప్రతినిధుల సమక్షంలో దీన్ని ప్రారంభించారు. "హైదరాబాద్ ఎల్లప్పుడు జీస్‌కు వ్యూహాత్మక కేంద్రంగా ఉంది. ఈ కొత్త క్యూఇసి ద్వారా, సాంకేతిక మద్దతును అందించడం ద్వారా మాత్రమే కాకుండా, ఈ పరిశ్రమల కోసం రూపొందించిన మా అత్యంత అధునాతన పరిష్కారాలను ప్రదర్శించడం ద్వారా కూడా మేము మా వినియోగదారులకు దగ్గరగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. జీస్ ఇండియా ప్రతినిధి అవీన్ పద్మప్రభ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏరోస్పేస్‌లో పెట్టుబడులు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని తెలంగాణ ప్రభుత్వ ఏరోస్పేస్, డిఫెన్స్, లాజిస్టిక్స్ డైరెక్టర్ ప్రవీణ్ పి.ఎ పేర్కొన్నారు.

కొడంగల్‌లో మధ్యాహ్న భోజనం అక్షయ పాత్రకు

- 14న గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ ప్రారంభానికి సిఎంకు ఆహ్వానం


సిఎంకు ఆహ్వానం పలుకుతున్న అక్షయ పాత్ర ఫౌండేషన్ నిర్వాహకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజక వర్గమైన కొడంగల్ నియోజక వర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు అక్షయ పాత్ర ఫౌండేషన్ ముందుకు వచ్చింది. సోమవారం ఉదయం హైదరాబాద్‌లో అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ నెల 14న కొడంగల్‌లో నిర్మించ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ కిచెన్ ప్రారంభోత్సవానికి రావాలని వారు ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు కొడంగల్ సమీపంలోని ఎన్కేపల్లిలో రెండెకరాల విస్తీర్ణంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ గ్రీన్ ఫీల్డ్ కిచెన్‌ను నిర్మించనుంది. ఆ కిచెన్‌లో వండిన భోజనాన్ని నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనానికి ఒక్కో విద్యార్థికి రూ.7 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు అక్షయ ఫౌండేషన్ దాదాపు రూ.25 వరకు ఖర్చు పెడుతోందని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వం చెల్లించే నిధులకు అదనంగా అయ్యే ఖర్చును అక్షయ పాత్ర ఫౌండేషన్ భరిస్తుందని వివరించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సిఎస్ఆర్) నిధుల సాయంతో ఈ పథకం అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గతేడాది డిసెంబర్ నుంచి ఈ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ అందించే పథకం విజయవంతంగా అమలవుతున్నదని 312 పాఠశాలల్లో దాదాపు 28 వేల మంది విద్యార్థులకు ప్రతి రోజు ఉదయాన్నే అల్పాహారం అందిస్తున్నారు.

ఫార్మసీ పరీక్షలపై సందిగ్ధం

- నేటి నుంచి ప్రారంభమవుతాయన్న జెఎన్టీయూహెచ్
- ప్రయివేటు కాలేజీల బంద్‌తో విద్యార్థుల్లో ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బీ ఫార్మసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు రెండో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని జెఎన్‌టియు హైదరాబాద్ ప్రకటించింది. ఈ నెల 14 వరకు ఈ పరీక్షలుంటాయని షెడ్యూల్‌ను విడుదల చేసింది. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలు సోమవారం నుంచి నిరవధిక బంద్ చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో ప్రయివేటు కాలేజీల్లో తరగతులు జరగడం లేదు. బోధన, బోధనేతర సిబ్బంది కూడా బంద్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో బిఫార్మసీ ప్రథమ సంవత్సరం విద్యార్థుల పరీక్షల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. ఈ పరీక్షలు మంగళవారం నుంచి జరుగుతాయా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది. విశ్వవిద్యాలయాల పరిధిలో జరిగే అన్ని రకాల పరీక్షలనూ బహిష్కరిస్తున్నట్టు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య (ఫతి) వెల్లడించింది. ఎలాంటి పరీక్షలనైనా వాయిదా వేయాలంటూ వర్సిటీలను కోరింది. అయినప్పటికీ జెఎన్‌టియు హైదరాబాద్ బీ ఫార్మసీ పరీక్షలను నిర్వహించడానికి షెడ్యూల్‌ను విడుదల చేయడం పట్ల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. జెఎన్‌టియు హైదరాబాద్‌కు అనుబంధంగా ఉన్న ప్రయివేటు కాలేజీల్లో యాజమాన్యాలు సహకరించకుండా పరీక్షలు ఎలా జరుగుతాయన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఈ పరీక్షల నిర్వహణపై జెఎన్‌టియు హైదరాబాద్ అధికారులు స్పష్టత ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసాలు

హైదరాబాద్ బ్యూరో : ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో వరుసగా మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరస్థులకు సహకరిస్తున్న ముగ్గురిని హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఎసిపి శివమారుతి తెలిపిన వివరాల ప్రకారం.. ఎపి గుంటూరుకు చెందిన ఎం.రమేష్‌రెడ్డి, విశాఖపట్నానికి చెందిన గాంధీ శ్రీను, విజయవాడకు చెందిన జి.శ్రీధర్ సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సైబర్ నేరస్థులతో చేతులు కలిపారు. కమీషన్లు పుచ్చుకుంటున్న ఈ ముఠా వివిధ బ్యాంక్ అకౌంట్ వివరాలను, ఏటీఎం కార్డులను సైబర్ నేరస్థులకు అందిస్తోంది. దేశవ్యాప్తంగా అమాయకులను ఎంచుకుంటున్న సైబర్ నేరస్థులు తాము చెప్పిన విధంగా ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని నమ్మిస్తున్నారు. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో వాట్సప్ కాల్స్ చేస్తూ వారు సేకరించిన బ్యాంక్ ఖాతాలకు డబ్బులను డిపాజిట్ చేయించుకుంటున్నారు. ఆ తర్వాత ఎం.రమేష్‌రెడ్డి, గాంధీ శ్రీను, జి.శ్రీధర్‌కు కమీషన్లు ఇచ్చి వారి సహాయంతో డబ్బులను విత్‌డ్రా చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ మోసాలపై బాధితులు సిసిఎస్‌లో ఫిర్యాదు చేశారు. నగర సిపి సజ్జనార్ ఆదేశాలతో సిసిఎస్ ఎసిపి శివమారుతి సూచనలతో ఇన్‌స్పెక్టర్ నరేష్ అన్ని కోణాల్లో విచారణ చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

పత్తి సేకరణపై ఆంక్షలొద్దు

- ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితి సరిగాదు
- సిసిఐలో ఐదేండ్లుగా లేని నిబంధనలు ఇప్పుడెందుకు?
- మిగతా పత్తిని రైతులు ఎక్కడ అమ్ముకోవాలి
- కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గి ఇప్పటికే పత్తిపై సుంకాలు ఎత్తేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు తాజాగా సిసిఐ ద్వారా పత్తికొనుగోళ్లపై ఆంక్షలు విధించడం సరిగాదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎకరానికి ఏడు క్వింటాళ్ల పత్తినే కొనుగోలు చేస్తామని పరిమితి విధించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మిగతా పత్తి పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలని నిలదీశారు. ఐదేండ్లుగా లేని నిబంధనలు ఇప్పుడే ఎందుకు అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పత్తి రైతుల పట్ల శాపాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎంతో వ్యయప్రయాసలకోర్చి సీసీఐ పెట్టిన నిబంధనల ప్రకారం పత్తిని తీసుకువెళ్తుంటే ఇప్పుడు కొత్తగా ఎకరానికి ఏడు క్వింటాళ్ల పరిమితి అనడం కేంద్ర ప్రభుత్వం యొక్క ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని విమర్శించారు. సబ్సిడీ దిగుమతులకు కేంద్రం అనుమతించడం వలన మార్కెట్లో పత్తి రేటు రూ.6000 వరకు పడిపోయిందని తెలిపారు. సీసీఐ మీద భరోసాతో తీసుకొస్తున్న క్రమంలో సీసీఐ నుంచి రాష్ట్ర సర్కారుకు వచ్చిన లేఖ పత్తిరైతులకు ఆశనిపాతం లాంటిదేనని పేర్కొన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ స్టాటిస్టిక్స్ అంచనాల ప్రకారం తెలంగాణలో సరాసరి దిగుమతి 7 క్వింటాళ్లు కాబట్టి అంతే కొనుగోలు చేస్తామని ప్రకటించడం సహేతుకం కాదని తెలిపారు. నల్లరేగళ్ల ఎకరాకు 15 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని గుర్తుచేశారు. మిగతా పత్తిని రైతులు ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నించారు. ఇటువంటి నిబంధనలతో రైతాంగాన్ని గోస పెట్టడం సరికాదని హితవు పలికారు. వెంటనే సీసీఐ అమల్లోకి తెచ్చిన కొత్త నిబంధనను తీసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దిగుమతి సుంకాలు ఎత్తివేయడంపై పునరాలోచన చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. 'అమ్మ పెట్టా పెట్టదు, అడుక్కోనివ్వదు' అన్న చందంగా కేంద్రం ఒకవైపు సుంకాలు ఎత్తివేసి, బహిరంగ మార్కెట్లో పత్తికి ధర పతనమయ్యేలా చేసింది, ఇంకోవైపు సీసీఐ ద్వారా సవాలక్ష కొర్రీలు పెట్టిందీ కేంద్రమేనని విమర్శించారు. తెలంగాణ పత్తి రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఎకరాకు 7 క్వింటాళ్ల నిబంధనను ఎత్తేసి పాత పద్ధతిలోనే కొనుగోలు చేయాలనీ, తేమశాతం 20 వరకు ఉన్నా పత్తిపంటను కొనుగోలు చేసేలా సీసీఐని ఆదేశించాలని డిమాండ్ చేశారు. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

కొల్లూరు 'డబుల్' ఇళ్లలో అన్ని వసతులు కల్పిస్తాం

- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా కొల్లూరులోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో నివసిస్తున్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ప్రాంగణంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సుమారు లక్ష మంది నివసిస్తున్నారని, దాంతో ఈ ప్రాంతం మినీ హైదరాబాద్‌గా మారిందన్నారు. దాంతో ఇక్కడి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాంట్లో భాగంగా హైదరాబాద్‌లోని వీఎస్టీ పరిశ్రమ సాయంతో సీఎస్ఆర్ ఫండ్స్ కింద రూ.4 కోట్లతో ప్రభుత్వ పాఠశాల ఫేస్ 1 నిర్మాణ పనులకు సోమవారం మంత్రులు శంకుస్థాపన చేశారు.

ఎర్రజెండాదే భవిష్యత్తు

- సోషలిస్టు విధానాలకు పెరుగుతున్న ఆదరణ : తమ్మినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నయా ఉదారవాద విధానాలు ఆర్థిక సంక్షోభాల నుండి ప్రపంచ దేశాలను గట్టెక్కించే విధంగా లేవనీ, సోషలిస్టు విధానాలే ప్రత్యామ్నాయంగా ముందుకు వస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని వీరభద్రం తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అధ్యక్షతన నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతుల్లో తమ్మినేని ప్రారంభోపాన్యాసం చేశారు. ఏక ధృవ ప్రపంచం నుండి బహుళ ధృవ ప్రపంచం వైపు పయనిస్తుందనీ, అమెరికా డాలర్ పెత్తనానికి వ్యతిరేకంగా బ్రిక్స్ దేశాల కూటమి చైనా నాయకత్వంలో ముందుకు వచ్చిందని తెలిపారు. ఆయా దేశాల స్థానిక కరెన్సీలో ప్రపంచ వ్యాపారానికి ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. దీంట్లో భారతదేశం కూడా భాగస్వామ్యం కావడానికి ముందుకు రావడం మంచి పరిణామమని తెలిపారు. నయా ఉదారవాద విధానాల వల్ల నిరుద్యోగం, పేదరికం, ఉపాధి కోసం వలసలు పెరుగుతున్నాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పాటు కార్మికులకు నిజ వేతనాలు లేక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ప్రజలు కొనుగోలు శక్తి పడిపోతున్నదని వివరించారు. మరో పక్క ఆకలి కేకలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులు, రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని తెలిపారు. సామ్రాజ్యవాద దేశమైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన ఆర్థిక, మాంద్యం నుండి బయటపడటానికి ఆయుధాలు, మందు గుండు సామాగ్రిని అమ్ముకునేందుకు యుద్ధాలను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. తన మాట వినని దేశాలపైన సుంకాలు విధించటానికి అమెరికా సిద్ధపడిందని తెలిపారు. చిన్న చిన్న దేశాలు సైతం అమెరికా టారీఫ్‌లకు వ్యతిరేకంగా మాట్లాడుతుంటే. మోడీ మాత్రం నోరు విప్పడం లేదని విమర్శించారు. రష్యా నుంచి ఆయిల్ కొనొద్దని బెదిరించటం, భారత్ పాకిస్తాన్ యుద్ధం తానే ఆపానంటూ చెబుతున్నా మోడీ మౌనంగా ఉండటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. అమెరికా విధించిన టారీఫ్‌లకు యధావిధిగా అమలు చేస్తే వ్యవసాయ రంగంలో సోయాబీన్, పత్తి, బియ్యంతో పాటు మత్స, చేనేత పరిశ్రమ, పాడి పరిశ్రమ, పౌల్ట్రీ పరిశ్రమ పూర్తిగా నాశనం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి ధారంగా బతుకుతున్న అనేక మంది ఉపాధిని కోల్పోతారని చెప్పారు. మోడీ, ట్రంప్ లాలూచిని ఎండగడుతూ విస్తృత ప్రచారాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్, కేంద్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, నారి ఐలయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ గిరిజన బాలికల పాఠశాల ప్రిన్సిపల్ సస్పెన్షన్

- మరో ఇద్దరు ఉపాధ్యాయులపై శాఖాపరమైన విచారణ..!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా దేవరకొండ గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ కల్యాణిని సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సహస్రత మాధవి ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల వేధింపులు భరించలేక అక్టోబర్ 31వ తేదీన ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం విదితమే. ఉపాధ్యాయుల వేధింపుల వల్లే ఇలా చేసుకున్నట్టు ఆస్పత్రిలో చికిత్స సమయంలో మాధవి నల్లగొండ రీజనల్ కోఆర్డినేటర్ బలరాంనాయక్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. తన కూతురు ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి ప్రిన్సిపల్ కల్యాణి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, అమృత కారణమని తల్లి చంద్రకళ మీడియా ఎదుట ఆరోపించారు. వారి ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాంతో దేవరకొండ తహసీల్దార్ మధుసూదనరెడ్డి ఆస్పత్రికి వచ్చి బాలికతో మాట్లాడారు. ఘటనను సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రిన్సిపల్ కల్యాణిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఉపాధ్యాయులు విజయలక్ష్మి, అమృతలపై శాఖాపరమైన విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటారని సమాచారం.

విద్యార్థినిలను వేధిస్తున్న ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నాగర్ కర్నూల్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినిలను వేధింపులకు గురి చేస్తున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంపై స్వయంగా విద్యార్థినిలే జాతీయ రహదారిపై ఆందోళన చేశారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని కమ్మదనం శివారులో నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న నాగర్ కర్నూల్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యార్థినిలు వందలాదిగా గురుకులం నుండి పాదయాత్రగా వచ్చి షాద్ నగర్ పట్టణంలోని జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారని పేర్కొన్నారు. తక్షణమే ప్రిన్సిపల్ శైలజను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

చేవెళ్ల రోడ్డు ప్రమాద ఘటనపై ఆర్‌టిసి దిగ్భ్రాంతి

- టిప్పర్ అతివేగమే కారణం
- ప్రాథమిక విచారణలో వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేవెళ్ల రోడ్డు ప్రమాద ఘటన దురదృష్టకరమైనదని టిజిఎస్‌ఆర్‌టిసి పేర్కొంది. ప్రాణాలు కోల్పోయిన 19 మందికి తమ సంతాపం తెలియజేసింది. క్షతగాత్రులైన ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. టిజిఎస్ ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి, హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రో షా ఖాన్, ఇ.డి (ఆపరేషన్స్) శ్రీధర్, రంగారెడ్డి రీజనల్ మేనేజర్ శ్రీలత, తదితర సీనియర్ అధికారులు ఆస్పత్రికి వెళ్ళి సహాయక చర్యల్ని ముమ్మరం చేశారు. గాయపడిన 25 మందికి మెరుగైన చికిత్స అందించాలని అధికారి బృందం ఆస్పత్రి డాక్టర్లను కోరారు. చనిపోయిన 19 మందిలో ఐదుగురు పురుషులు, 14 మంది మహిళలు, మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి సంబంధీకులకు అప్పగించారు.

ఈ ఘటనకు సంబంధించి ప్రాథమిక విచారణ అనంతరం, ప్రమాదానికి ఆర్‌టిసి బస్సు గానీ, బస్సు డ్రైవర్ గానీ కారణం కాదని తెలిపింది. బస్సు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నట్లు, డ్రైవర్ సర్వీసు రికార్డు ప్రకారం ఎలాంటి యాక్సిడెంట్ రికార్డు లేనట్టు తేలిందని గుర్తు చేసింది. రోడ్డు మలుపు వద్ద అతి వేగంతో ఉన్న టిప్పర్ డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ దురదృష్టకర సంఘటనలో చనిపోయినవారికి శాంతి చేకూరాలని కోరుకుంటూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని టిజిఎస్‌ఆర్‌టిసి ఆకాంక్ష అంటూ సోమవారం ఆ సంస్థ యాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేసింది.

చేవెళ్ల రోడ్డు ప్రమాదంపై కెసిఆర్, కెటిఆర్ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఖానాపూర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారికి సంతాపం, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా తాండూర్ బస్ డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు, టిప్పర్ ఢీకొన్న దుర్ఘటనలో 21 మంది ప్రయాణికులు మరణించడం బాధాకరమని తెలిపారు. మరణించిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు గాయపడిన ప్రయాణికులకు మెరుగైన వైద్య సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ..

మొలకెత్తిన ధాన్యంతో ప్రధాన రోడ్డుపై రైతుల రాస్తారోకో

- జిల్లా అధికారులు వచ్చేంత వరకు విరమించబోమని నిరసన
- సిద్దిపేట జిల్లా నంగునూరులో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అధికారులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా మొలకెత్తిన ధాన్యంతో నంగునూరు-సిద్దిపేట ప్రధాన రోడ్డుపై క్రిమిసంహారక మందు డబ్బాలతో రైతులు రాస్తారోకో చేపట్టారు. సోమవారం రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ధర్నాలో ప్రతిపక్ష పార్టీల నాయకులు పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. ఈ క్రమంలో ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో ధాన్యం కాపాడుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశామని, అయినా ఏ అధికారి, ప్రజాప్రతినిధులు... రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించలేదని ఆరోపించారు. రైతుల ధర్నా విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట ఎస్‌ఐ వి.వివేక్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. జిల్లా స్థాయి అధికారులు తహసీల్దార్, వ్యవసాయ అధికారి వచ్చి ధాన్యం కొనుగోలు విషయంలో సమాధానం చెప్పేంత వరకు నిరసన విరమించేదిలేదని రోడ్డుపై బైఠాయించారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను వచ్చి సంబంధిత అధికారులకు ఫోన్‌లో సమాచారాన్ని అందజేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తమతోనే ఉంటామని సీఐ రైతులకు నచ్చ చెప్పి ఆందోళన విరమింపజేశారు. కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలు లేవని తహసీల్దార్ మాధవికి రైతులు ఫిర్యాదు చేశారు. కనీసం తాగు నీరు కూడా లేదని, వ్యవసాయ అధికారి గీతకు ఫోన్ చేసినా స్పందించడం లేదని రైతులు ఆరోపించారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించాలని రైతులు కోరడంతో పోలీసుల ఆధ్వర్యంలో వెళ్లి తడిసిన ధాన్యాన్ని, వర్షానికి కొట్టుకుపోయి మొలకెత్తిన ధాన్యాన్ని అధికారులు పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని తహసీల్దార్ మాధవి హామీ ఇచ్చారు. ఈ క్రమంలో మండల వ్యవసాయ అధికారి గీత తహసీల్దార్ కార్యాలయానికి రాగానే రైతులు ఆమెపై ప్రశ్నల వర్షం కురిపించారు. అనంతరం డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ వరలక్ష్మి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులకు, రైతులకు పలు సూచనలు చేశారు. త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేపట్టాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారి గీతను తొలగించాలని, కొనుగోలు కేంద్రం అవకతవకలపై డిసిఒ, తహసీల్దార్‌కు రైతులు వినతి పత్రాన్ని అందజేశారు.



ప్రజాకళలను ప్రోత్సహిద్దాం

- ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభను జయప్రదం చేద్దాం
- ప్రముఖ సినీ నిర్మాత రాజ్ కందుకూరి, సినీ దర్శకులు బాబ్జి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాకళలను ప్రోత్సహిస్తూ.. ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ప్రముఖ సినీ నిర్మాత రాజ్ కందుకూరి, సినీదర్శకులు బాబ్జి పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర మూడో మహాసభ సందర్భంగా నిర్వహించనున్న జానపద ఉత్సవాల పోస్టర్‌ను హైదరాబాద్ ఫిలింనగర్‌లో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సినిమా రంగానికి మహానటులైన అల్లు రామలింగయ్య, జమున, గుమ్మడి వెంకటేశ్వరరావు, మాదాల రంగారావులాంటి ఎంతోమందిని అందించింది ప్రజానాట్యమండలి అని గుర్తుచేశారు. ప్రజానాట్యమండలిలో పనిచేసే నాయకత్వం నుంచి "మాభూమి" వంటి అద్భుతమైన సినిమాలు వచ్చాయన్నారు. పీడిత, తాడిత ప్రజల సమస్యలపై స్వరాన్ని వినిపిస్తూ కళారూపాల ద్వారా సమాజాన్ని ప్రజానాట్యమండలి చైతన్యవంతం చేస్తోందని తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయడంలో ప్రజా కళాకారులు, సినీ ప్రముఖులు, ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. అభ్యుదయ సినిమాలు నిర్మించడంలో, ఆ సినిమాల్లో నటించడంలో ప్రజానాట్యమండలిలో పనిచేసిన ఎందరో నటులే ముందున్నారన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ, రైతుల సమస్యలు, మహిళల హక్కుల కోసం తమ కళారూపాల ద్వారా పోరాడిన సంస్థ ఇదన్నారు. సమానత్వం, సామరస్యతతో కూడిన సమాజం నిర్మాణమే ప్రజానాట్యమండలి లక్ష్యం అని చెప్పారు. మహాసభను విజయవంతం చేయడంలో హైదరాబాద్ ప్రజలు, సినీ ప్రముఖులు చురుకైన పాత్ర పోషించాలని నిర్వాహకులు కోరారు. రాష్ట్ర నలుదిక్కుల నుంచి దాదాపు 600 మంది ప్రతినిధులు మూడ్రోజుల జానపద ఉత్సవాల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి మహాసభ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.మారన్న, కోశాధికారి కళ్యాణ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొండూరి భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు రాము, హైదరాబాద్ నగర కమిటీ సభ్యులు క్రాంతి కుమార్, ప్రజా సంఘాల నాయకులు ఎన్.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణ

- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణ ప్రకటిస్తున్నట్టు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. సోమవారం ఈ మేరకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో శాంతియుత వాతావరణం కొనసాగాలని ప్రజా, సామాజిక సంఘాలు, ప్రజల ఆకాంక్ష మేరకు గత మే నెలలో కాల్పుల విరమణ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. తమ వైపు నుంచి అనుకున్న పద్ధతులను అమలు జరిపి శాంతియుత వాతావరణం కొనసాగేలా చేశామని తెలిపారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం తెలంగాణలో కొనసాగుతున్న శాంతియుత వాతావరణాన్ని భంగం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా అన్ని పార్టీలు, ప్రజా, సామాజిక సంఘాల వాళ్ళు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు ముక్త కంఠంతో ఖండించాలని కోరారు.

'మొంథా'తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- షరతుల్లేకుండా తడిసిన ధాన్యాన్ని, పత్తిని కొనుగోలు చేయాలి : మల్లు నాగార్జున రెడ్డి
- సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల మొంథా తుఫాన్ మూలంగా నష్టపోయిన రైతుల పంటను అంచనావేసి నష్టపరిహారం చెల్లించాలని, షరతుల్లేకుండా తడిసిన ధాన్యాన్ని, పత్తిని కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొంథా తుఫాన్ మూలంగా జిల్లాలో వరి పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంట చేతికందేలోపే మొంథా తుఫాన్ నిండా ముంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఇప్పటివరకు పంట నష్టపరిహారాన్ని ప్రకటించకపోవడం దుర్మార్గమని అన్నారు. ఎన్నికలు, కాంట్రాక్టులపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ రైతాంగంపై లేదని విమర్శించారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల మూలంగా రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పట్టించుకునే నాధుడే కరువయ్యాడన్నారు. ఐకెపి, పిఎసిఎస్ కేంద్రాల్లో ధాన్యాన్ని రోజుల తరబడి నిల్వచేసినా కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దయి మొలకెత్తుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యం, పత్తిని ఎలాంటి షరతుల్లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతాంగాన్ని ఆదుకోవాలని, వరి ఎకరాకు రూ.40 వేలు, పత్తికి రూ.70 వేల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొలిశెట్టి యాదగిరిరావు, పారేపల్లి శేఖర్‌రావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులు దండా వెంకటరెడ్డి, షేక్ సైదా, దుగ్గి బ్రహ్మం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, రైతు సంఘం జిల్లా నాయకులు దేవరం వెంకటరెడ్డి, నాగిరెడ్డి శేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, నారాయణ వీరారెడ్డి, అవిరే అప్పయ్య, మేరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



బంద్‌కు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు

- ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయివేటు కాలేజీల నిరవధిక బంద్‌లో భాగంగా సోమవారం మొదటి రోజు బంద్‌కు సహకరించిన ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులకు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య కృతజ్ఞతలు తెలిపింది. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సమాఖ్య చైర్మన్ రమేశ్ బాబు తదితరులు మాట్లాడారు. పెండింగ్ స్కాలర్ షిప్స్ రూ.పది వేల కోట్లలో సగం రూ.ఐదు వేల కోట్లు వెంటనే చెల్లించేంత వరకు నిరవధిక బంద్ కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. నవంబర్ 8న కనీసం 30 వేల మంది ఉన్నత విద్యాసంస్థల ఉద్యోగులతో భారీ సమావేశం నిర్వహిస్తామని, 11న 10 లక్షల మంది విద్యార్థులతో సచివాలయానికి లాంగ్ మార్చ్ చేపడతామని వారు ప్రకటించారు.

గ్రానైట్ లారీ అదుపుతప్పి ఇంట్లోకి..

- వాకిలి ఊడుస్తున్న వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై గ్రానైట్ లారీల బీభత్సంతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారి మడూర్ గ్రామంలో జరిగింది. స్థానిక ఎస్ఐ గొల్లమూడి ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళుతున్న గ్రానైట్ లారీ (టీఎస్ 02 యుఎ 0909) డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా లారీని నడపడంతో అది అదుపు తప్పి ఓ ఇంటి ముందున్న సెంట్రింగ్ బాక్సులకు లారీ ఢీకొట్టింది. ఈ సమయంలో తాడూరి లక్ష్మి (70) తన ఇంటి ముందు వాకిలి ఊడుస్తుండగా సెంట్రింగ్ బాక్సులు ఆమెపై పడి పక్కటెముకలకు బలమైన దెబ్బలు తగిలాయి. దాంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వైద్యం పొందుతూ పరిస్థితి విషమించి ఆమె మృతి చెందినట్టు లక్ష్మి కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



డిసెంబర్ 19 నుంచి 29 వరకు బుక్ ఫెయిర్

- లోగోను ఆవిష్కరించిన నిర్వాహకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ ఏడాది డిసెంబర్ 19 నుంచి 29వ తేదీ వరకు 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ను హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ కళాభారతి ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ యాకూబ్ షేక్, కార్యదర్శి వాసు, కోశాధికారి పి నారాయణరెడ్డి, సలహా మండలి సభ్యులు ఎమ్మెల్సీ ఎం కోదండరాం, కె రామచంద్రమూర్తి, ఎగ్జిక్యూటివ్ కమిటీ ఉపాధ్యక్షులు కె బాల్ రెడ్డి, బి శోభన్ బాబు, జాయింట్ సెక్రెటరీ కె సురేశ్, సభ్యులు ఎ జనార్ధన్ గుప్తా, యు శ్రీనివాసరావు, టి సాంబశివరావు, స్వరాజ్ కుమార్, డి కిస్టారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాకుబ్ షేక్ మాట్లాడుతూ మూడేళ్లుగా ప్రతి ఏడాది డిసెంబర్‌లో పుస్తక మహోత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఉత్సవంలో పిల్లల పుస్తకాలు మొదలు శాస్త్రీయ పుస్తకాల వరకు అన్ని రకాల జాతీయ, అంతర్జాతీయ బుక్ స్టాల్స్ ఉంటాయని తెలిపారు. పది రోజుల్లో 360 మంది సాహిత్యకారులను పరిచయం చేస్తున్నామని, ప్రతి రోజు నాలుగు గంటల పాటు పిల్లల కోసం కార్యక్రమాలుంటాయని తెలిపారు. స్థానిక సాంస్కృతిక ఈవెంట్స్‌ను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. పల్లె గ్రంథాలయాలకు గతేడాది ఆరు వేల నుంచి ఏడు వేల వరకు పుస్తకాలను అందజేసినట్టు తెలిపారు. ఈ ఏడాది కూడా పుస్తక దాతల నుంచి బుక్ ఫెయిర్‌లో బుక్స్ సేకరించనున్నట్టు చెప్పారు. వాసు మాట్లాడుతూ ఈ ఏడాది ముఖ్యమైన పబ్లిషర్స్‌కు స్థానం కల్పించాలని నిర్ణయించినట్టు తెలిపారు. బుక్ ఫెయిర్‌లో 250 నుంచి 260 వరకు స్టాళ్లు ఉంటాయని చెప్పారు. ఈ ఏడాది బుక్ ఫెయిర్ బ్యాక్ గ్రౌండ్ కలర్‌గా నీలిరంగును ఎంచుకున్నట్టు తెలిపారు. గత రెండేండ్లలో వివాదానికి దారి తీసిన పుస్తకాలు, ఇతర మతాలను కించపరిచేలా ఉన్న సాహిత్యం విషయంలో కమిటీ చర్చించినట్టు చెప్పారు. అలాంటి ఘటనలు తలెత్తకుండా ఈ ఏడాది వాటిని బుక్ ఫెయిర్‌లో వాటిని తగ్గించి, నిషేధించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఈ ఏడాది బుక్ ఫెయిర్ గతేడాది కంటే బాగుండబోతుందని తెలిపారు. గతేడాది బుక్ ఫెయిర్ ముగిసిన వెంటనే హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ సమావేశమై సమీక్షించిందనీ, ఆ మేరకు లోటుపాట్లు మరింత సరిదిద్దుకుని రానుందని చెప్పారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రభుత్వ సహకారం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బుక్ ఫెయిర్ ఏర్పాటుతో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది బుక్ ఫెయిర్‌లో ఢిల్లీ పబ్లిషర్స్‌ను ఎక్కువ మందిని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. విజ్ఞానాన్ని అందిస్తున్న బుక్ ఫెయిర్ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

30 వరకు దరఖాస్తులకు ఆహ్వానం

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో పాల్గొనేందుకు దరఖాస్తులను నవంబర్ 30 వరకు అన్ని పని దినాల్లో బాగ్ లింగంపల్లి ఎం.హెచ్.భవన్‌లోని హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యాలయంలో తీసుకుంటున్నట్టు తెలిపారు. స్టాళ్ల కేటాయింపు డ్రా తేదీని తర్వాత ప్రకటిస్తారు.

నవీన్‌యాదవ్‌కు మజ్దూర్ యూనియన్ మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు నేషనల్ మజ్దూర్ యూనియన్ మద్దతు ప్రకటించింది. సోమవారం నవీన్‌యాదవ్ తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ యూనియన్ నాయకులను కలిశారు. ఈసందర్భంగా జూబ్లీహిల్స్‌లో పోటీచేస్తున్న తన కుమారుడు నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కొద్దిసేపు సమకాలిన అంశాలపై మాట్లాడుకున్నారు. అనంతరం మద్దతు ప్రకటిస్తూ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి కమల్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు మర్రి నరేందర్, చైర్మన్ సి చెన్నారెడ్డి ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు.



ప్రాచీన సంస్కృతి సాహిత్యం పట్ల ఆసక్తి తగ్గుతోంది

- రాజ్య సభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్

ప్రజాశక్తి - కల్చరల్

ప్రాచీన సంస్కృతి సాహిత్యం పట్ల ఆసక్తి తగ్గుతోంది అని రాజ్య సభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్ అవేదన వ్యక్తం చేశారు. విదేశీ ఆహారపు అలవాట్లు పిజ్జా బర్గర్ లతో పాటు విదేశీ సంస్కృతి పట్ల యువత లో వ్యామోహం ఎక్కువ అవుతోంది అని ఇవి శారీరక మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి అని ఆయన అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై వసుంధర బిల్డర్స్ నిర్వాహణలో కన్నడంలో రాజశేఖర మాతపతి (రాగం) రచించిన సిద్ధేశ్వర శ్రీ సంపుటి పృథ్వీ రాజ్ రాంపూర తెలుగులో యోగస్థగా అనువదించిన గ్రంథం ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ లక్ష్మణ్ పాల్గొని గ్రంథం ఆవిష్కరణ చేసి మాట్లాడారు. భారతీయ సంప్రదాయ ఆహారం యోగ ధ్యానం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుంని అన్నారు. సిద్ధేశ్వర వంటి గురువులు చరిత్ర తెలుసుకోవడం అవసరమని, దేశ సంపద యువత మత్తు మందులకు అలవాటు పడి అసాంఘిక కార్యక్రమాలులో భాగస్వాములు అవుతున్నారని అన్నారు. మంచి యోగులు జీవిత చరిత్రల గురించి తెలుసుకున్న వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. కార్పొరేటర్ పావని, వసుంధర, గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి బిజెపి నాయకుడు వినయ కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్న కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్స్ పోతిరెడ్డి రమేష్ బాబు, వరుణ్ అగర్వాల్ , పోలీస్ పటేల్ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణ చేశారు.

ఉపాధి'కి లేని 'హామీ'

- గణనీయంగా తగ్గిన పనుల కల్పన
- 47.6 శాతం తగ్గిన పనిదినాలు
- 19.94 శాతానికి తగ్గిన కుటుంబాల సంఖ్య
- తొలగించిన జాబ్‌కార్డుల పునరుద్ధరణలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు పని కల్పించి వారిని ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులో రాష్ట్రం వెనుకబడింది. కార్మికుల సంఖ్య పెరిగినా ఉపాధి లేకపోవడంతో నిర్దేశించిన వేతనాన్ని కార్మికులు పొందలేకపోయారు. లిబ్‌టెక్ ఇండియా సంస్థ 2025 ఏప్రిల్ సెప్టెంబర్ వరకు ఉపాధి హామీపై నిర్వహించిన సర్వే ఈ విషయం తేల్చింది. ప్రభుత్వ నివేదికల ఆధారంగానే తాము ఈ రిపోర్టు తాయారు చేసినట్టు ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉపాధి పనుల అమలు తీరుపై తాజా గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

సగటు పనిదినాల్లో క్షీణత

గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పనిచేసిన ప్రత్యేక కుటుంబాల సంఖ్య 25.33లక్షల నుంచి 19.94లక్షలకు తగ్గింది. అంటే ప్రతి కుటుంబానికి సగటున 41 రోజుల నుంచి 27 రోజులకు పనిదినాలు పడిపోయాయి. ఏప్రిల్ సెప్టెంబర్ మధ్యలో మొత్తం పనిదినాలు 47.6 శాతం తగ్గాయి. దేశ వ్యాప్తంగా ఆ తగ్గుదల 10.4శాతం ఉంది అని గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆదాయం తగ్గటానికి ప్రధాన కారణం పనిదినాలను కల్పించటంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని అర్థమవుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు పని కల్పించి వారిని ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం అమలులో రాష్ట్రం వెనకబడటానికి నిర్వహణలో నిర్లక్ష్యం తప్ప మరొకటి కాదని విమర్శలు ఉన్నాయి.

వేతన నష్టం..

పని దినాలు తగ్గిపోవడం వల్ల ఆదాయాలు పడిపోయి, కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. కేంద్రం ప్రకటించిన రూ.300నుంచి రూ.307కు పెరిగినప్పటికీ పనిదినాలు తగ్గటం వల్ల



కుటుంబానికి ఏడాదికి రూ.1,686 మాత్రమే పొందారు. గతేడాది ఉన్న పనిదినాలే కల్పిస్తే..ప్రతి కుటుంబానికి రూ.3,515 అదనంగా సంపాదించేవారమని ఉపాధి హామీ కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థను తప్పని సరి చేయటం వల్ల కార్మికులకు ఇబ్బందిగా మారింది. ఇందుకోసం కార్మికుల జాబ్ కార్డుకు ఆధార్ లింకు అవ్వాలి. ఆధార్, జాబ్ కార్డుపై పేరు సరిగ్గా పొంతన కుదరాలి. బ్యాంకు అకౌంట్‌ను ఆధార్ లింక్ కావడంతోపాటు ఎన్‌పిసిఐలో నమోదు కావాలి. వీటిల్లో ఏది లేకపోయినా కార్మికులు ఎబిపిఎస్‌కు అనర్హులుగా మారుతున్నారు. 2022-23లో ఆధార్ ఆధారిత చెల్లింపు విధానం(ఏబీపీఎస్) అమలు సమయంలో 5.1లక్షల జాబ్ కార్డులు తొలగించినట్టు సర్వే వెల్లడించింది. అయితే, అలాంటి తొలగింపు తర్వాత పునరుద్ధరణ చర్యలు చేపట్టకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. 2025-26లో తొలగింపులు కొనసాగుతున్నాయి. కానీ..తొలగించిన వారిని తిరిగి చేర్చుకునే ప్రక్రియ జరగటం లేదు. అత్యధిక తగ్గుదల ఉన్న జిల్లాల్లో మెడ్చెల్ మల్కాజిగిరి (-92.8శాతం), జోగులాంబ గద్వాల(-72శాతం), కామారెడ్డి(-68శాతం) నిజామాబాద్(-67శాతం) ఉన్నాయి. ఇది ఆందోళన కలిగించే విషయం. మోస్తరుగా తగ్గిన జిల్లాలను పరిశీలిస్తే.. ఆదిలాబాద్ (-18శాతం), నల్లగొండ (-24.5శాతం), యాదాద్రి భువనగిరి (-34.3శాతం), సిద్దిపేట (-34.7శాతం)గా ఉన్నాయి. తెలంగాణలో నమోదైన 53లక్షలకు పైగా కార్మికులకు ఈకేవైసీ పూర్తి చేయలేదు.దీంతో వేతనాలు ఆలస్యం కావడం, లేదా నిరాకరించటం చేస్తున్నారు. రాష్ట్రంలో కేవలం 48.5శాతం మాత్రమే ఇకెవైసి పూర్తయిందంటే.. పరిస్థితి ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమవుతుంది. సామాజిక తరగతులవారీగా చూసినప్పుడు ఎస్‌సి (-48.3శాతం) ఎస్‌టి (-41.7శాతం) ఇతరులు (-49.3శాతం) తగ్గుదల ప్రభావాన్ని తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. పథకం అమలు చేయడంలోనూ, కార్మికులకు ఉపాధి కల్పించడంలోనూ ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపించింది.